


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## – వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – ‘మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?’ అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో ‘పీజీ టు కేజీ’ గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది ‘బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే’లో తొలివిడతగా ‘ఫన్ నేనొక్కడినే’. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే
## *చివరి విడత: మలి సందడి (53)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది - అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.
అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.
ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి - రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి - చదవడం మొదలెడితే - ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-2020లోనూ - 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.
అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' మార్చి 2018లో ముగిసింది. ఏప్రిల్ 2018నుంచి చివరి విడతలో 'మలి సందడి' అంశాల వివరణ మొదలైంది. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.
రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

### *స్వర్గావరోహణ పర్వంలో ఎప్పుడు, ఎక్కడ, ఎలా*

మకాం మార్చే ప్రయాణానికి– ఎప్పుడు, ఎక్కడ, ఎలా అనే మూడు నిర్ణయాలు ముఖ్యమైనవి, క్లిష్టమైనవి అంటారు. ఆ మాట అందరికీ, అన్నివేళలా వర్తిస్తుందనను. కానీ– ఏడాదిపాటు విదేశంలో సకుటుంబంగా కులాసాగా గడిపిన మాకు– స్వదేశానికి తిరిగి వెళ్లడానికి ఈ నిర్ణయాలు ఎన్నో సందిగ్ధాలకు దారి తీసిన మాట నిజం. వాటిలో ప్రయాణం 'ఎప్పుడు'– అన్న విషయానికొస్తే–

నావంటి స్కాలర్సు విషయంలో డాడ్ సంస్థ చాలా ఉదారంగా ఉంటుంది. నెల జీతం అంతకు ముందు నెలలో చివరి తేదీకే ఇచ్చేస్తుంది. ఇక తిరుగుప్రయాణమయ్యే నెలలో కూడా– నెలాఖరు దాకా ఉండక్కర్లేదు. మొదటి ఎనిమిది రోజులు పని చేస్తే చాలు! అందుకని మేము 'ఎప్పుడు' వెనక్కి వెళ్లిపోతామన్న విషయం డాడ్ ఆఫీసుకి ముందుగా తెలియబర్చాలి.

ఆ పని చేసేయొచ్చుగా, దీనికి మీమాంస ఎందుకు, అంటే–

డాడ్ ఉదారంగా వ్యవహరించినా– నేనొచ్చిన రీసెర్చి పని పట్ల నాకూ బాధ్యత ఉంది. రీసెర్చిపరంగా ఇక్కడుండే ప్రతిరోజూ నాకెంతో విలువైనది. వాటిలో ఒక్క రోజు వదులుకున్నా– ఆ మేరకు ఇండియాలో మా సంస్థకు నష్టమే!

మామూలుగా నా స్కాలర్‌షిప్ అక్టోబర్ 31 వరకూ. ఎక్స్‌టెన్షన్ తర్వాత అది వచ్చే సంవత్సరం మార్చి 31 వరకూ అయింది. కానీ మా ఆఫీసు అనుమతించింది డిసెంబర్ 31 వరకూ. కాబట్టి నేను డిసెంబరు 31 తర్వాతనే ఇండియాకు ప్రయాణమవాలని నా ఉద్దేశ్యం.

శ్రీమతి ఒప్పుకోలేదు. మనిషికి నిజాయితీ, బాధ్యత ఉండాలని నేనూ అంటాను. కానీ ఈ విషయంలో అవి అర్థరహితం. మీరే చూడండి– డిసెంబర్ చివరి వారమంతా సెలవులే. ఆఫీసుకి కూడా చాలామంది రారు. ఇక్కడుండడం– ఉన్నామన్న పేరుకే" అందామె.

అదీ నిజమే!

యూరప్‌లో క్రిస్మస్ చాలా పెద్ద పండుగ. నేను గ్రహించిన మేరకు జర్మనీలో డిసెంబర్లో ముఖ్యంగా 24, 25 తేదీల్లో వైనాక్టెన్ పేరిట ఘనంగానూ, ఆత్మీయంగానూ వేడుక జరుపుకుంటారు. తమ ప్రేమాభిమానాల్ని కానుకల రూపంలో పంచుకుంటారు. ఆ రెండు రోజులూ అక్కడ పోస్టాఫీసుతో సహా అన్ని సంస్థల కార్యాలయాలూ మూసేస్తారు.

24 బుధవారం అయింది, 25 లక్ష్మివారం. 26 శుక్రవారం. తర్వాత శని, ఆదివారాలు. ఆ తర్వాత ఆ నెలకు మిగిలిన పనిదినాలు మూడంటే మూడు. ఆ తర్వాత జనవరి 1 కొత్త సంవత్సరం.

తిరిగేవాళ్లు తిరుగుతారు. తాగేవాళ్లు తాగుతారు.

వారివారి అభిరుచుల ప్రకారం వైనాక్టెన్ ఎంజాయ్ చెయ్యాలని అంతా అనుకుంటారు.

కొత్త సంవత్సరం దాటేవరకూ ఆఫీసులకి వెళ్లేవారుండరు– ఏ నాలాంటివారో అతికొద్దిమంది తప్ప!

ఐనప్పటికీ నాకు డిసెంబర్లో ప్రయాణమవడానికి మనసొప్పలేదు. శ్రీమతికి నచ్చజెప్పడానికి అట్నించి నరుక్కొచ్చాను.

యూరప్‌లో క్రిస్మస్ వేడుకలు చూడడం కూడా ఒక గొప్ప అనుభవం. గత సంవత్సరం ఆ వేడుకల్ని చూసి దిమ్మెరపోయాను. శ్రీమతి, పిల్లలు అవి చూడలేదే అని తెగ బాధ పడ్డాను. క్రిస్మస్ లోగా వాళ్లను తీసుకు రావాలంటే– అప్పుడు తేదీలు కుదరలేదు.

వాళ్లు జనవరిలో వచ్చారు. మేమక్కడ ఉండేది అక్టోబరు వరకూ మాత్రమే కాబట్టి– మావాళ్లకు క్రిస్మస్ వేడుకలు చూసే అవకాశం లేదనే అనుకున్నాను.

కానీ అనుకోకుండా మేము డిసెంబర్ 31వరకూ ఉండడానికి– ఇటు డాడ్, ఇటు మా ఆఫీసూ కూడా సమ్మతించాయి.

మన దేశంలో సంక్రాంతి, ఉగాది, వినాయకచవితి, దసరా– ఇలాంటి పండుగ వేడుకలకోసం ఏటా ఎదురు చూస్తుంటాం.

పేదలతో నిండిన పేద దేశంలోనే ఇలా ఉంటే– జర్మనీ డబ్బుతో మూలిగిపోతున్న దేశం. డబ్బు లెక్కలేనివాళ్లు జర్మన్లు.

ప్రతి రోజూ పండుగలా జరుపుకునే ఈ దేశంలో క్రిస్మస్ లాంటి పండుగ వేడుకలెలా ఉంటాయో చూడ్డం ఓ గొప్ప అనుభవం కాదా?

"కుదరనివాళ్లకి కుదరదు. మనకి అవకాశం వచ్చింది. ఈసారి మీరు పక్కనుండడంవల్ల రెట్టించిన ఉత్సాహంతో ఇక్కడి క్రిస్మస్ వేడుకల్ని అస్వాదిస్తాను" అన్నాను శ్రీమతితో.

నేను చెప్పింది అర్థమైన మేరకు పిల్లలు బాగా ఉత్సాహపడ్డారు. దాంతో శ్రీమతికి కూడా తన ఉత్సాహాన్ని బయటపెట్టక తప్పలేదు.

జనవరి మొదటి వారానికి మా ప్రయాణమని నిశ్చయించేక– ఆఫీసులో మిత్రులకి చెప్పాను.

"అప్పుడే నువ్వెళ్లిపోయే రోజు వచ్చేస్తోందా?" అని డెకర్ట్, మ్యులర్ బాధ పడ్డారు.

కిర్ష్నర్ తనూ బాధ పడుతూనే, మాపిల్లల ఆటలకి తాత్కాలికంగా తనిచ్చిన కిరాణా దుకాణం బొమ్మని ప్రస్తావించాడు.

మా ప్రయాణానికి ఇంకా నెలన్నరపైన ఉన్నప్పటికీ– నేనా బొమ్మని మర్నాడే ఆఫీసుకి చేర్చాను. కారులో ఐతే డిక్కీలో ఇమిడిపోతుంది కానీ, దానికోసం కిర్ష్నర్ని మా ఇంటికి పిలిచే ఉద్దేశ్యం లేదు. ఎందుకంటే– ఇంటికొస్తే తినడానికో, తాగడానికో ఏమైనా ఇచ్చి పంపడం మర్యాద. కానీ ఆతిథ్యం అతడికి ఇబ్బంది. ఆపైన అతడి మనసు మంచిదే కానీ, ఇబ్బందికి సద్దుకుపోయే ఔదార్యం తక్కువ. ఆసక్తి ఐతే అటూ ఇటూ కూడా తక్కువే.

బొమ్మ తిరిగివ్వగానే కిర్ష్నర్ మొహం ఇంతయింది, "నాకేం అర్జంటు లేదు. ఇంకా టైముందిగా" అని మర్యాద చూపాడు. అది తనకు బాల్యస్మృతి అనీ, దాచుకోవాలన్న మమకారాన్ని చంపుకోలేకపోతున్నాననీ, లేకపోతే మా పిల్లలకు శాశ్వతంగా ఇచ్చేసేవాణ్ణని సంజాయిషీ కూడా ఇచ్చాడు. కాస్త ముందు చెబితే కారు తీసుకొచ్చేవాణ్ణంటూ– నేనది మోసుకొచ్చినందుకు నొచ్చుకున్నాడు.

"పిల్లల సంగతి తెలియనిదేముంది? ఎంత గొప్ప వస్తువైనా వాళ్ల మోజు కొన్నాళ్లే! నువ్విచ్చిన ఈ బొమ్మతో ఇన్నాళ్లు ఆడుకోవడమే విశేషం. ఇక ఈ బొమ్మ విషయానికొస్తే– కూడా స్వదేశం తీసుకెళ్లడానికి అనువైనది కాదు. ఐనా పిల్లలు మనసు పడి బలవంతపెడితే, కొనాల్సి వచ్చేదేమో! అప్పుడైనా వెళ్లేముందు ఇక్కడే ఇంకెవరికో ఇచ్చేసి ఉండేవాణ్ణి.

నువ్వు నాకా అగత్యం తప్పించి పెద్ద మనసుతో ఈ బొమ్మనిచ్చావు. అందుకు నీకు థాంక్స్ చెప్పాలి" అని మనస్ఫూర్తిగా అన్నాను.

ఏషియన్సు అంటే అతడికి కొంత చిన్నచూపు. కొంత అసహనం. తనకు సహకరించే కొలీగ్స్ లేక మాట్లాడేటప్పుడు తనని తాను అదుపు చేసుకునేందుకు ప్రయత్నించేవాడు. నేను శాంతంగా తిప్పికొడితే ఉడుక్కునేవాడు. ఐతే నేనతణ్ణి ఒక్కసారి కూడా పల్లెత్తు మాట అనలేదు. ఇతర జర్మన్ కొలీగ్సే నావంటివారి పట్ల అతడి మాతతీరుకి నొచ్చుకునేవారు. మా విషయంలో ఆఫీసులో తనొక్కడి ప్రవర్తనా భిన్నంగా ఉన్నట్లు అతడికే గ్రహింపుకొచ్చిందేమో, క్రమంగా అతడిలో మార్పు మొదలైంది. చివరకు తనే ఆఫర్ చేసి– మా పిల్లలకు తన చిన్నప్పటి బొమ్మనివ్వడానికి కారేసుకుని మా ఇంటికొచ్చేడు. అప్పటి మా ఆతిథ్యాని పరోక్షంగా చిన్నబుచ్చినా– నా పట్ల స్నేహభావానికి లోటు రానివ్వలేదు.

వందల సంవత్సరాల రాజరికపు దాస్యసృంఖలాలనుంచి విముక్తులమై, ప్రజాస్వామ్యానికి పట్టం కట్టాం. తర్వాత దశాబ్దాలు గడిచినా, మన నాయకులు– ప్రజాసేవ చేస్తామని సామాన్య ప్రజలముందు చేతులు జోడించి వేడుకుని, అలా లభించిన ఓట్లతో ప్రజానాయకులై– ఆ సామాన్య ప్రజలనే అహంకారంతో నిరసిస్తున్న దేశంనుంచి వచ్చాను నేను.

రెండవ ప్రపంచయుద్ధంలో సర్వనాశనమైన దేశాన్ని– ప్రపంచదేశాల్లో ఒక ఉన్నత ఆర్థికవ్యవస్థగా నిలపాలన్న ఆశయాన్ని– అపూర్వమైన స్వయంకృషితో– పాతికేళ్లలోనే సాధించిన పౌరులున్న దేశమిది. వారిలో కొందరికి అహంకారముంటే ఆ అర్హతనూ వారు సాధించుకున్నారని సరిపెట్టుకోగలను.

అందుకే కిర్ష్నర్ అంటే నాకెప్పుడూ స్నేహభావం తప్ప మరొకటి లేదు.

అక్కడున్న నా మిత్రులలో అహమ్మద్‌కి నావద్ద చొరవ ఎక్కువ. సున్నితమైన అంశాన్ని కూడా నావద్ద ప్రస్తావించడానికి సంకోచించడు. నా తిరుగు ప్రయాణం గురించి విని, "రావ్! నాదో సలహా! ఎలాగూ జనవరిలో వెడదామని అనుకుంటున్నప్పుడు ప్రయాణం జనవరి 8 తర్వాత పెట్టుకో. ఆ నెల స్కాలర్‌షిప్ కూడా దక్కించుకోవచ్చు" అన్నాడతడు.

ఈ సలహాకి బదులుగా, నేను సూటిగా నా మనోభావాల్ని చెప్పొచ్చు. కానీ అందువల్ల అతణ్ణి చిన్నబుచ్చినట్లవుతుందే తప్ప మరే ప్రయోజనమూ ఉండదు.

అహమ్మద్ మంచివాడే కానీ– నీతీ నిజాయితీల పట్టింపు తక్కువ. అలాగని అతడిపై నాకు తక్కువ భావం లేదు.

నీతి, నిజాయితీలకు ఈ ప్రపంచంలో సరైన నిర్వచనం లేదు. ఒక జీవన విధానానికి అలవాటుపడ్డ నేననుకునే నీతి, నిజాయితీలు అతడికి విచిత్రంగా అనిపించొచ్చు. అతడి జీవన విధానంలో, అతడుంటున్న సమాజంలో, అతడు నమ్మే సిద్ధాంతాల్లో– నేననుకునే నీతి, నిజాయితీలకున్న ప్రాధాన్యం వేరు కావచ్చు.

ఏ మనిషికీ చెడ్డవాడిననిపించుకోవాలనుండదు. దుర్మార్గుడు కూడా తను మంచివాడిననే అనుకుంటాడు. తన మంచితనానికి గుర్తింపు లభించాలని తాపత్రయం కూడా పడతాడు.

అహమ్మద్ నాకా సలహా ఇవ్వడంవల్ల– అతడికేం ప్రయోజనం లేదు. నాకు లాభం చెయ్యాలన్న సదుద్దేశ్యంతో ఆ మాటన్నాడు. అలాంటప్పుడు అతడికి నీతి, నిజాయితీల గురించి నా భావాలు చెబితే, అదతణ్ణి చిన్నబుచ్చడమే ఔతుంది.

ఒక విధంగా అతడి సలహాలో అర్థమూ ఉంది.

నాకు డాడ్ ఆరునెలలు ఎక్స్‌టెన్షన్ ఇచ్చింది. జనవరినుంచి మార్చి దాకా నేనిక్కడే కొనసాగితే, ఆ మూడు నెలలూ కూడా ఠంచనుగా నా జీతం అందుతుంది. మూడు నెలలు దాటి ఉండొద్దన్నది మా ఆఫీసు శాసనం. దాన్ని పాటించాలా వద్దా అన్నది నా ఇష్టం.

నేను మా ఆఫీసు శాసనాన్నే పాటించాలనుకున్నాను. అంటే మూడు నెలలకి మాత్రమే జీతం తీసుకోవాలి. అహమ్మద్ చెప్పినట్లు జనవరికి కూడా జీతం తీసుకున్నానా– నేను నాలుగు నెలల జీతం తీసుకున్నట్లు ఔతుంది.

అందుకు డాడ్ అభ్యంతరపెట్టదు. కానీ మనస్సాక్షి!

ఇదంతా అహమ్మద్‌కి చెప్పడం అనవసరం అనుకున్నాను. అతడి సలహాని మెచ్చుకుని, థాంక్స్ చెప్పాను. వోభీ ఖుష్, మైభీ ఖుష్!

జనవరి మొదటివారంలో 5వ తేదీ దాటకుండా టికెట్లు బుక్ చెయ్యాలని నేను, శ్రీమతి కలిసి ఓనిర్ణయానికొచ్చాం. అలా 'ఎప్పుడు' మీమాంస తీరింది. ఇక 'ఎక్కడ' అన్న మీమాంస.

జనవరిలో ప్రయాణమనుకోగానే శ్రీమతి, "మన ప్రయాణం ఎక్కణ్ణించి?" అనడిగింది.

"ఎక్కణ్ణించేమిటి? మనం కొన్న టికెట్లు రానూ పోనూ అని మర్చిపోయావా?" అన్నాను ఆశ్చర్యంగా.

శ్రీమతి వెంటనే, "తెలియక మొసళ్ల కొలనులో దూకి, ఎలాగో వాటి బారినుంచి తప్పించుకుని బయటపడితే అది అదృష్టం. ఐతే అదృష్టాన్ని నమ్ముకుని మళ్లీ మొసళ్ల కొలనులో దూకితే అది ఆత్మహత్యతో సమానం కదూ!' అంది నర్మగర్భంగా.

నాకు అర్థం కాలేదు, "హాయిగా వెనక్కి తిరిగివెడుతున్నప్పుడు ఈ ఆత్మహత్యల ప్రస్తావన ఎందుకు?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఇప్పుడు నేనొక్కత్తినీ, ఇద్దరు పిల్లల్నీ సామాన్నీ తీసుకుని ఈస్ట్ బెర్లిన్ వెళ్లి, ఏరోఫ్లోట్ విమానమెక్కి, మాస్కోలో దిగి, అక్కడ కొన్ని గంటలు ఆగి.…." అని ఇంకా ఏదో అనబోతుంటే–

ఆమె మాటల లోతు అప్పుడర్థమైంది, "అర్థమైంది. మళ్లీ అలాంటి ప్రయాణం చెయ్యలేనంటావు. అంతేనా?" అన్నాను.

“ఔను. ఈసారి మీరు పక్కన లేకుండా నేను ప్రయాణం చెయ్యను” అంది శ్రీమతి.

విమానంలో భార్యాబిడ్డలతో కలిసి ప్రయాణం చెయ్యడం నాకూ ఇష్టమే!

కానీ ఇక్కడో మెలిక ఉంది.

నేనున్నది జర్మనీ. డాడ్ జర్మన్ సంస్థ. వారి కార్యక్రమాలన్నింటికీ జర్మన్ లావాదేవీల ముడి ఉంటుంది.

నేనిక్కడికి లుఫ్తాన్సా విమానంలో వచ్చాను. లుఫ్తాన్సాలోనే వెళ్లాలి. లుఫ్తాన్సా జర్మన్ కంపెనీ.

నేను భార్యాబిడ్డలతో కలిసి ఇండియాకు తిరిగి వెళ్లాలంటే, లుఫ్తాన్సాలోనే వెళ్లాలి. వాళ్ల టికెట్ ఖర్చు డాడ్ భరించదు. నేనే పెట్టుకోవాలి. లుఫ్తాన్సా టికెట్ ధర ఏరోఫ్లోట్‌లో రానూపోనూ కలిపి అయిందానికంటే ఎక్కువ.

పోనీ నేను, మావాళ్లూ కలిసి ఇంకేమైనా ఫ్లైట్లో వెడదామంటే అప్పుడు డాడ్ నా టికెట్ ఖర్చు భరించదు. లుఫ్తాన్సా ఐతేనే వాళ్లు నా ఖర్చు భరిస్తారు.

ఈ విషయమై మిగతా ఇండియన్స్ ఏంచేస్తున్నారని వాకబు చేశాను.

వాళ్లు కూడా ప్రయాణం భార్యాబిడ్డలతో కలిసి చెయ్యడం లేదు. ఐతే తమవాళ్ల రాకపోకలకి ఏరోఫ్లోట్‌లో కాక, ఎయిరిండియాని ఎంచుకున్నారు.

ఎయిరిండియా గురించి నాకూ తెలుసు. శ్రీమతి ఇక్కడికి వచ్చేటప్పుడు కూడా ఎయిరిండియా ప్రపోజలూ వచ్చింది. రానూపోనూ కలిపి ఒక మనిషికి ఏరో ఫ్లోట్‌లో పన్నెండొందలైతే, ఎయిరిండియా పదమూడొందలు.

ఐతే నేను ఏరోఫ్లోట్‌ని ఎంచుకోవడానికి కారణం– వంద రూపాయలకు కక్కుర్తిపడ్డం కాదు.

ఎయిరిండియా చార్టర్డ్ ఫ్లైట్స్ నేరుగా బెర్లిన్‌కి రావు. వచ్చేవాళ్లు నెదర్లాండ్‌లో ఆమ్‌స్టర్‌డామ్‌లో దిగాలి. ఎక్కేవాళ్లూ అక్కణ్ణించే ఎక్కాలి.

ఏరోఫ్లోట్ ఐతే నేరుగా బెర్లిన్ వచ్చేయొచ్చు కదా అనుకున్నాను. కానీ ఆ బెర్లిన్ తూర్పు బెర్లిన్ కావడమూ– ఆ విమానాశ్రయం తూర్పు బెర్లిన్లో కాకుండా తూర్పు జర్మనీలో ఉండడమూ– ఆ కథంతా ఇదివరకు చెప్పుకున్నాం కదా!

శ్రీమతి మొసళ్ల కొలనుని ప్రస్తావించడానికి అదీ కారణం!

అప్పుడైతే తెలియదు. ఇప్పుడు తెలుసు కాబట్టి– ఆ తప్పు మళ్లీ చెయ్యకూడదంటుందామె.

నేను వెంటనే ఈ టికెట్లు బుక్ చేసిన ట్రావెల్ ఏజంట్ సేన్‌కి కబురెట్టాను. అతడు వచ్చాడు.

పరిస్థితిని వివరించి చెప్పేక, అతడు కొన్ని విషయాలు చెప్పి మమ్మల్ని నిదానంగా అలోచించుకోమన్నాడు.

ఒకటిః బుక్ చేసిన టికెట్ కేన్సిల్ చెయ్యదల్చుకుంటే– ఏరోఫ్లోట్ సంస్థకి కనీసం మూడు నెలలు ముందు చెప్పాలి. లేకపోతే రిఫండ్‌గా వచ్చే మొత్తం బాగా తగ్గిపోతుంది. ఇప్పుడు మేమిచ్చిన టైం ఆరు వారాలే కాబట్టి కొంత నష్టానికి సిద్ధపడాలి.

రెండుః టికెట్‌ని ఇండియా వెళ్లే వేరెవరికైనా బదిలీ చెయ్యొచ్చు. మాకెవరికైనా తెలిసినవారుంటే సరేసరి, లేకుంటే తన వంతు ప్రయత్నం తను చేస్తాడు. ఎటొచ్చీ అందుకు కొంచెం టైం పట్టొచ్చు.

మూడుః ఎయిరిండియా విమానం ఎక్కడానికి ఆమ్‌స్టర్‌డామ్ వెళ్లాలన్న నియమం లేదు. జర్మనీలో ఫ్రాంక్‌ఫర్ట్ నించి కూడా ఎయిరిండియా ఫ్లైట్సున్నాయి.

నాలుగుః పశ్చిమ బెర్లిన్ నుంచి ఫ్రాంక్‌ఫర్ట్ వెళ్లడానికి విమానంకంటే ట్రైన్ ఐతే చౌక. విమానంలోనే వెళ్లాలని అనుకుంటే, టికెట్లను ముందుగా తనే బుక్ చేస్తాడు.

అతడు చెప్పింది సావధానంగా విన్నాక, "టికెట్ బదిలీ చెయ్యడానికి మాకు తెలిసినవారెవ్వరూ లేరు. నీ ప్రయత్నం నువ్వు చెయ్యి. మిగతా విషయాలు రెండు మూడు రోజుల్లో చెబుతాను" అని అతణ్ణి పంపేశాను.

అతడు వెళ్లిపోయేక, "ఒక విషయంలో నా నిర్ణయం ఐపోయింది. నువ్వు ఏరోఫ్లేట్‌లో వెళ్లడం లేదు. ఆలోచించాల్సిందల్లా– మనం కలిసి ప్రయాణం చెయ్యాలా, విడివిడిగా వెళ్లాలా అని!" అన్నాను.

కలిసి ప్రయాణం చెయ్యాలనుకుంటే– ఖర్చు తడిసి మోపెడౌతుంది. కానీ ఆ నిర్ణయం నేను కాదు, తను తీసుకోవాలి.

శ్రీమతి క్షణం కూడా జాప్యం చెయ్యలేదు, "ఎయిరిండియా ఫ్రాంక్‌ఫర్ట్‌నుంచి బయల్దేరుతుందిగా, మీరు మమ్మల్ని అక్కడ ప్లేనెక్కించండి. ముంబైలో దిగేసరికి మీ అన్నయ్య మమ్మల్ని రిసీవ్ చేసుకుంటాడు. ఇందులో పెద్దగా ఆలోచించాల్సిందేముంది?" అంది.

మొదట్నించీ తనంతే! ఏ నిర్ణయం తీసుకున్నా ఆర్థికపరిస్థితిని అంచనా వేస్తుంది. అందులో తనకి కాస్త ఇబ్బంది ఉన్నా, తేలిక చేసి చెప్పి, నా మనసు తేలిక పరుస్తుంది.

ఏరోఫ్లోట్ విషయమై ఆమె అభ్యంతరంలో న్యాయముంది. అసలు తనకంటే ముందు నేనా విషయం ఆలోచించాల్సింది.

ఏమైతేనేం మా ప్రయాణం 'ఎక్కడ' అన్నది తేలిపోయింది. పశ్చిమ బెర్లిన్‌నుంచి కలిసి ట్రైనులోనూ, ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి విడివిడిగా విమానంలోనూ వెళ్లాలన్న నిర్ణయమయ్యేక– సేన్‌కి చెప్పేశాను. తర్వాత...

నేననుకున్నట్లే మావాళ్ల టికెట్లు బదిలీ చెయ్యడానికి ఎవరూ దొరకలేదు. అటు డాడ్, ఇటు సేన్‌కి చెప్పి మా టికెట్లు బుక్ చేయించాం.

ఈ ప్రయాణంలో మావాళ్ల గురించి నాకు అదనంగా 800 మార్కులు ఖర్చు చెయ్యాల్సొచ్చింది.

ఆర్థికపరంగా పెరిగిన ఆత్మవిశ్వాసం కొంత. అక్కడ ఎంతో పొదుపుగా ఉండడం కొంత. ఆ ఖర్చు మాకు భారంగా అనిపించలేదు.

మా టికెట్లకు డేట్సు వచ్చేశాయి.

మేమంతా కలిసి ట్రైన్లో ఫ్రాంక్‌ఫుర్ట్ వెడతాం. అక్కడ ముందు మావాళ్లని నేను ప్లేనెక్కిస్తాను. మర్నాడు రాత్రికి నా ప్రయాణం.

ఎప్పుడు, ఎక్కడ అన్నది తేలిపోయింది. ఇక 'ఎలా' అన్న మరో ముఖ్యాంశం మిగిలింది.

మా ఇద్దరివీ పెద్ద కుటుంబాలు. ఆపైన ఉమ్మడి కుటుంబాలు కూడాను.

అన్నలు, అక్కలు, తమ్ముళ్లు, చెల్లెళ్లు, మేనత్తలు, మేనమామలు, పినతల్లులు, బాబాయిలు, తలిదండ్రులు, అత్తమామలు....

ఇవి దూరపు బంధుత్వాలు కావు. మేమంతా ఏదో ఒక సమయంలో ఒకే కుటుంబం అనిపించేలా కలిసి ఉన్నవాళ్లం. అందరితోనూ మరచిపోలేని అత్మీయానుబంధముంది.

అలాగే భువనేశ్వర్లో మా ఆఫీసులోనూ– ముఖ్యంగా తెలుగువారిలోనూ చాలామందితో– మేమంతా ఒకే కుటుంబం అనిపించేటంత ఆత్మీయానుబంధం ఉంది.

వీలు, ప్రాధాన్యాల్నిబట్టి కుటుంబానికో, వ్యక్తులకో– చిన్నదో, పెద్దదో– జ్ఞాపిక ఇవ్వాలనుకున్నాం.

అప్పటికే కొందరు మమ్మల్ని స్టెతస్కోపు, ఆడియో కాసెట్లు, ఫోటో రీల్సు వగైరాలు కావాలని అడిగారు. కూడా తీసుకెడితే బరువు ఎక్కువౌతుందని కాసెట్లని మాత్రం మేము పోస్టల్ పార్సెల్సుగా కొందరికి పంపాం. ఎందుకంటే మాకు కావాల్సిన కాసెట్లని కూడా మేము మా పేరిట పార్సెల్సుగా పంపుకున్నాం.

జ్ఞాపిక ఆలోచన మొదట్నించీ ఉండడంవల్ల బయటికెళ్లినప్పుడల్లా– ఎవరికి ఏ కానుక ఇవ్వాలీ– ఎంతలో ఇవ్వాలీ అన్న ధ్యాసతో దుకాణాల్ని గమనిస్తుండేవాళ్లం. మరీ నచ్చినవీ, అనువుగా ఉన్నవీ వెంటనే కొనేసినా– వాయిదా వేసినవి చాలా ఉన్నాయి.

ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చింది.

నాలుగున్నర దశాబ్దాల్లో వచ్చిన మార్పులవల్ల అప్పటి మా ఆలోచనలు హాస్యాస్పదంగా అనిపించవచ్చు. కానీ అప్పుడవి ఆధునికంగానే అనిపించేవి...

అప్పట్లో ఇండియాలో చాలామందికి టేపు రికార్డరు కొనడం సంగతి అటుంచి చూడడమే పెద్ద విశేషం. ఇప్పుడు నిత్యావసరాలుగా పరిగణించబడే ఎన్నో ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరికరాలింకా మార్కెట్లో లేవు.

షాపులకెడితే కొన్న సరుకులు వేసుకుందుకు కూడా సంచులు తీసుకెళ్లాల్సి ఉండేది. ఉచితంగా ప్లాస్టిక్ సంచీలు (క్యారీ బాగ్స్) ఇచ్చే సంప్రదాయం ముమ్ముందు ఒకటొస్తుందన్న ఊహ కూడా లేదు. ఉదాహరణకు....

నాకంటే రెండేళ్లముందు జర్మనీ వెళ్లిన ప్రసాద్ అనే ఓ కొలీగ్– ఇండియాలో వాడుకుందుకు అనువుగా ఉంటాయని కొన్ని ప్లాస్టిక్ సంచులు తెచ్చుకొచ్చాడు. తనకి ఇష్టులైన ముగ్గురికి తలో ప్లాస్టిక్ సంచీ ఇచ్చాడు. వాళ్లలో నేనూ ఉన్నాను. ఆ సంచీ మాకు దక్కిందని కొలీగ్సులో కొందరు అసూయ పడ్డారు. మేము కూడా ఆ సంచిని దాన్ని అపురూపంగా దాచుకున్నామే తప్ప వాడలేదు.

ఆతర్వాత రెండేళ్లకి నాకు జర్మనీ అవకాశమొచ్చింది. అప్పటికి తను కూడా జర్మనీ వస్తానని తెలియని శ్రీమతి నాతో, “వచ్చేటప్పుడు మీరు ప్లాస్టిక్ సంచులు కాస్త ఎక్కువగానే తీసుకురండి. మనం వాడుకుందుకే కాదు, వీలైనంత ఎక్కువమందికి ఇద్దాం” అంది.

శ్రీమతి బెర్లిన్ చేరేక– షాపింగులో వచ్చిన ప్రతి ప్లాస్టిక్ సంచీనీ పారవేయకుండా ఒకచోట దాచి ఉంచేది.

కేవలం సంచులే కాదు. డెక్‌మిల్ష్ పేరిట అమ్మే పెరుగు డబ్బాలు ఖాళీ అయ్యేక– వాటిలో ఒక్కటి కూడా పారెయ్యకుండా మేముండే గదిలోనే ఓ మూల దాచిపెట్టేది. ఇండియా వెళ్లేక వీలైనన్నాళ్లు వాటిని మేము వాడుకోవాలనీ, అడిగినవాళ్లకిఇవ్వాలనీ  మా ఉద్దేశ్యం.

ఇక ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరికరాల విషయానికొస్తే– వాటిలో ముఖ్యమైనవి ట్రాన్సిస్టర్లు. అవి అరచేతి పరిమాణంలో ఉండేవి. మామూలు చొక్కా జేబుల్లో సులభంగా ఇమిడిపోయేవి. అవి రకరకాల ఆకారాల్లో ఉండేవి.

జర్మన్సుకి ఇష్టమైన ఆట ఫుట్‌బాల్. ఆ బంతి ఆకారంలో ‘ఫుస్‌బాల్ రాడియో’ ట్రాన్సిస్టర్ చాలా ఆకర్షణీయంగా ఉండేది.

టేపురికార్డరుకి తగిలించి వినడానికి– పిల్లో స్పీకర్, స్టెతస్కోపులా ఉండే స్టెతో క్లిప్. కరెంటుతో చార్జి చేసుకునే బేటరీలు. ముడిస్తే వానిటీబ్యాగులో ఇమిడే గొడుగులు. ఇంకా పిల్లలాడుకునే రకరకాల బొమ్మలు. సావనీర్సు.

ఒకటా రెండా ఎన్నో ఆకర్షణీయమైన పరికరాలు.

అన్నీ చిన్న సైజువే చూసి కొనేవాళ్లం. ఆ కొనడం కూడా మామూలుగా డబ్బిచ్చి కొనడం కాదు. కొన్న ప్రతి వస్తువుకీ బిల్లు తీసుకుని, ఒక ఆకుపచ్చ దరఖాస్తు కాగితంమీద కొన్న వస్తువు వివరాలు, కొన్న ధర వేసి– దుకాణపు స్టాంప్ వేయించేవాళ్లం.

అందుకు కారణముంది.

మా ఇంటికి అతి దగ్గర్లోనే ఉన్న విల్మెర్స్‌డార్ఫర్ స్ట్రాసేలో పెద్దవీ, చిన్నవీ అన్ని రకాల షాపులూ ఉన్నాయి. చెప్పాలంటే ఏం కొనాలన్నా వేరే వీధికి వెళ్లనవసరం లేదు.

చిన్న అవకాశం వస్తే వదులుకోకుండా ఎదుటివారికి కొత్త రకం కానుక ఇవ్వడం మొదట్నించీ మాకు అలవాటు.

బెర్లిన్ వచ్చినప్పట్నించీ కూడా మేము వీలు కుదిరినప్పుడూ, కొండొకచో వీలు చేసుకునీ– షాపుల్లో తిరిగేవాళ్లం. అందువల్ల మాకు అక్కడ దొరికే వింత వస్తువులు చాలా తెలుసు. ఏమైనా కొత్త వస్తువుంటే చెప్పమని కొందరు ఇండియన్సు కూడా మమ్మల్ని అడిగేవారు.

మా మిత్రులు రావుగారికి చాలా మొహమాటం. కానుకలు తీసుకోవడం ఇష్టముండదు. వాళ్లింటికి పిలిస్తే ఏ అకేషనూ లేకుండా జాగ్రత్త పడేవారు. నవంబర్ మూడవ తేదీన వాళ్లబ్బాయి పుట్టినరోజని అంతకుముందెన్నడో కలుసుకున్నప్పుడు మాటల సందర్భంలో చెప్పారు. అది గుర్తుంచుకుని ఆ రోజుకి అతడికి కానుక ఇవ్వాలని ముందుగానే షాపులన్నీ తిరిగి ఓ ఆటోమాటిక్ కారు కొన్నాం. రిమోట్‌తో నడుస్తూ, నడుస్తున్నప్పుడు ఏదైనా అడ్డొస్తే దానంతటదే పక్కకు తిరిగే ఆ కారు పేరు 'కంప్యూటర్ ఆటో'. అది మాకెంతగా నచ్చిందంటే, మా పిల్లలకూ ఒకటి కొన్నాం.

కొడుకు పుట్టినరోజుకి రావుగారినుంచి మాకు ఆహ్వానం రాలేదు. ఆయన మొహమాటం తెలిసినవాళ్లం కాబట్టి, మేమా సాయంత్రం వాళ్లింటికెళ్లి బాబుకి కానుక ఇచ్చి సర్ప్రైజ్ చేశాం.

ఆ కారు బాబుకే కాదు– తలిదండ్రులకీ నచ్చింది. "ఇలాంటివన్నీ మీకెక్కడ దొరుకుతాయండీ" అన్నారు శ్రీమతి సత్యవతి మెప్పుకోలుగా.

ఇప్పుడీ ప్రస్తావన ఎందుకంటే– చాలా షాపులవాళ్లు మమ్మల్ని చూడగానే గుర్తు పడుతున్నారు. ఎంతలాగంటే ఓ షాపతను మా వివరాలు అడిగి, "ఐతే నువ్వు మీ దేశానికి తిరిగి వెళ్లిపోతావన్న మాట! కూడా తీసుకెళ్లడానికి చాలా కొంటున్నావు కాబట్టి నీకు నాదో సలహా! కొన్నాక ఆయా షాపుల్లో అడిగి ఆకుపచ్చ దరఖాస్తు ఫారం తీసుకో. స్వదేశం తీసుకెళ్లే ప్రతి వస్తువు వివరాలూ వ్రాయి. ఆ కాగితం మీద స్టాంప్ వేయించుకో. నువ్వు స్వదేశం చేరేక ఆ కాగితం, ఇక్కడ నీకు తెలిసున్నవాళ్లకి పంపితే– కస్టమ్స్ డ్యూటీ మినహాయింపుగా నీకు కొంత డబ్బొస్తుంది" అని సలహా ఇచ్చాడు.

అప్పట్నించీ ఆ సలహాని తూచా తప్పకుండా పాటిస్తున్నాం.....

స్వర్గావరోహణంలో మరికొన్ని ముచ్చట్లు వచ్చే నెల....

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments